క్లుప్తంగా

మధ్యాహ్న భోజనంలో నాణ్యత తప్పనిసరి


భోజనం రుచి చూస్తున్న ఎంఈఓ

గుడిపాల: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ రామ్‌నాయక్ అన్నారు. సోమవారం పల్లూరు తమిళం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

స్పందన వినతులపై నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు రూరల్: స్పందన అర్జీల విషయంలో నిర్లక్ష్యం వద్దని తహసీల్దార్ పార్వతి సూచించారు. చిత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజల నుంచే ఆమె అర్జీలను స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడికే పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు. కొన్ని అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేలా చూడాలని ఆదేశాలిచ్చారు. కాగా భూతగాదాలు, దారి సమస్యలు, పట్టా పాసుపుస్తకం మంజూరు, రేషన్‌కార్డు, ఒంటరి మహిళ ధృవీకరణ పత్రం తదితర విషయాలపై 23 అర్జీలు వచ్చాయని ఆమె తెలిపారు.

ఈఈ కార్యాలయం పరిశీలన

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో రూరల్ ఈఈ కార్యాలయాన్ని ఏఈఓ శైలజ సోమవారం పరిశీలించారు. ఏడాదిలో జరిగిన పనులు, ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్, వ్యవసాయ సర్వీసులు, విద్యుత్ వర్క్ ఆర్డర్స్, ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు.

ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

గుడిపాల: మండలంలోని చిన్న మరకాలకుప్పానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత శేఖర్ (60) గుండెపోటుతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీకి ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు శంభు, సాయి, వెంకటేశులురెడ్డి ఉన్నారు.

వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి

యాదమరి: ఎండ తీవ్రత ఎక్కువైందని.. వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలని యాదమరి వైద్యాధికారి అనిల్‌కుమార్ నాయక్ తెలిపారు. మండలంలోని కీనాటపల్లె దళితవాడ గ్రామంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎండ తీవ్రత దృష్ట్యా కూలీలు ఉదయం 10:30 గంటలకు ముందు.. సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చేసుకోవాలన్నారు. అనవసరంగా ఎండలో తిరగరాదని సూచించారు. వడదెబ్బ తగిలితే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.

సీపీఎఫ్‌లో జాతీయ భద్రతా దినోత్సవం


ప్రతిజ్ఞ చేస్తున్న కార్మికులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలోని సీపీఎఫ్ ఫ్యాక్టరీలో సోమవారం 52వ జాతీయ భద్రత దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఫ్యాక్టరీ నిర్వాహకులు కజాన్, చంద్రశేఖర్, సేఫ్టీ ఆఫీసర్ హనీఫా మాట్లాడుతూ.. ఫ్యాక్టరీలో పనిచేసే కార్మికులకు భద్రత అవసరమన్నారు. అలాగే ఆరోగ్య విషయాల్లో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింక మృతి


మృతి చెందిన జింక

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు ఇందిరానగర్ కాలనీ వద్ద సోమవారం ఉదయం జింక సమీపంలోని అడవి నుంచి జనావాసాల్లోకి వచ్చింది. అయితే కుక్కలు వెంటపడి జింకపై దాడి చేయడంతో మృతి చెందింది. స్థానికులు గుర్తించి అటవీశాఖ అధికారులకు సమాచారం అందజేశారు.

పగలు తాపం.. రాత్రి వణుకు

వేసవి ఆరంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. అయితే రాత్రి పూట ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. దీంతో పగలు భానుడి ప్రతాపం, రాత్రి వణికించే చలి ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. వాతావరణంలో చోటుచేసుకున్న ఇలాంటి మార్పులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జలుబు, దగ్గు, జ్వరాలు వెంటాడుతున్నాయి. నిత్యం రద్దీగా కనిపించే రోడ్లన్నీ మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఆరోగ్య సంరక్షణకు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవలసిన పరిస్థితులు నెలకొన్నాయి.

- ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసం
- వేసవి ఆరంభంలోనే ఎండల తీవ్రత
- మధ్యాహ్న వేళ నిర్మానుష్యంగా రోడ్లు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు


నిర్మానుష్యంగా కనిపిస్తున్న రోడ్డు

చిత్తూరు రూరల్: మార్చి ఆరంభమైంది. ఎండలు మండి పోతున్నాయి. వారం రోజులుగా ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు, మూడు డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. పగటిపూట సగటున 35–36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది. దీనికి ఉక్కపోత తోడైంది. మరోవైపు రాత్రి పూట చలి, ఉదయం పొగ మంచు పంజా విసురుతున్నాయి. ఇలాంటి భిన్నమైన వాతావరణం ప్రజలను అనారోగ్యం బారిన పడేస్తోంది. పగలు ఎండ ఎక్కువగా ఉండడం, రాత్రి చలి ఎక్కువగా ఉండడంతో ఉష్ణోగ్రతల్లో భారీ వ్యత్యాసం చోటుచేసుకుంటోంది. దాంతో భిన్న వాతావరణాన్ని తట్టుకోలేక జనం జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధులతో బాధ పడుతున్నారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లల్లో ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తుతున్నాయి.

చిత్తూరు నగర, మండల ప్రాంతాల్లో రాత్రయితే చలి చంపేస్తోంది. రాత్రి 6 గంటల నుంచి ప్రజలను వణుకు మొదలవుతోంది. ఇలా ఉదయం 7 గంటల వరకు చలి తీవ్రత కనిపిస్తోంది. ఆపై సూర్యతాపం మొదలవుతోంది. మధ్యాహ్న సమయానికి భానుడు భగభగ మండిపోతున్నాడు. కనిష్ట ఉష్ణోగ్రత 19 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 35 నుంచి 36 డిగ్రీల వరకు నమోదవుతోంది. దీంతో వాహనచోదకులు, పాదచారులు ఎండ తీవ్రతకు అల్లాడిపోతున్నారు. ఉక్కపోతతో ఇబ్బందిపడుతున్నారు. వృద్ధులు బయటకు వెళ్లాలంటే వెనుకడగు వేస్తున్నారు. నగరంలోని పలు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు రాకపోకలు చాలా వరకు తగ్గుముఖం పట్టాయి. ఈ ఎండలో తిరిగితే వడదెబ్బకు గురవుతామేమో అన్న భయం ప్రజలను వెంటాడుతోంది.

ఆరోగ్యసూత్రాలు అవసరం



వడదెబ్బ తగిలిన వారిని నీడలో ఉంచాలి. శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి వచ్చేంత వరకూ చల్లని నీటిలో ముంచిన గుడ్డతో శరీరాన్ని తుడవాలి. గాలి తగిలే ప్రదేశంలో ఉంచాలి. ఉప్పు కలిపిన మజ్జిగ లేదా చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజ్ ద్రావణం, ఓరల్ రీ హైడ్రేషన్ ద్రావణం (ఓఆర్ఎస్) తాగించాలి. పిల్లలు, గర్భిణులు, వృద్ధులు వేసవిలో అప్రమత్తంగా ఉండాలి. వడదెబ్బ తగిలి అపస్మారక స్థితిలో ఉన్న రోగికి నీరు తాగించకూడదు. ఆస్పత్రికి తరలించాలి.

– భాస్కర్, పీహెచ్‌సీ వైద్యాధికారి, బీఎన్‌ఆర్‌పేట



వడదెబ్బ లక్షణాలు – జాగ్రత్తలు

- చెమట పట్టకపోవడం, శరీర ఉష్ణోగ్రత పెరగడం, వణుకు రావడం, తగిన నిద్ర పట్టకపోవడం, కలవరింతలు రావడం, ఫిట్స్, పాక్షికంగా అపస్మారక స్థితికి వెళ్లడం వంటి లక్షణాలు వడదెబ్బగా గుర్తించవచ్చు.
- నీరు, పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, మజ్జిగ వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. రోజుకు కనీసం 15 గ్లాసుల నీళ్లు తాగాలి. మాంసాహారం తగ్గించి, తాజా కూరగాయలు తీసుకోవాలని వ్యాపారులు చెబుతున్నారు.
- ఆహారం తక్కువ మోతాదులో ఎక్కువ సార్లు తీసుకోవాలి.
- ఎండ తీవ్రత అధికంగా ఉన్న సమయంలో నీడ పట్టునే ఉండాలి.
- ఎండలో బయటికి వెళ్లాల్సి వస్తే కచ్చితంగా గొడుగు, తలకు టోపీ వంటివి వినియోగించాలి.
- ఉష్ణోగ్రత అధికంగా ఉన్నపుడు బయట తిరిగితే వడదెబ్బ బారిన పడే ప్రమాదం ఉంటుంది.

పశువులకు గాలికుంటు టీకాలు


టీకా వేస్తున్న పశువైద్యుడు

గుడిపాల: గాలికుంటు వ్యాధి సోకకుండా పశువులకు టీకాలు వేయించాలని బొమ్మసముద్రం పశువైద్యాధికారి రవితేజ అన్నారు. సోమవారం గొల్లమడుగు పంచాయతీలో సుమారు 260 పశువులకు టీకాలు వేశారు. టీకాలతో వ్యాధులను దూరం చేయవచ్చన్నారు. పాడి రైతులు తప్పనిసరిగా టీకా వేయించాలని సూచించారు.

సబ్‌స్టేషన్‌కు స్థలం మంజూరు

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు రూరల్ డివిజన్ పరిధిలో సబ్‌స్టేషన్ కోసం ప్రభుత్వం రెండు ఎకరాల స్థలం మంజూరు చేసిందని ట్రాన్స్‌కో ఈఈ హరి తెలిపారు. అరగొండలోని గాజులపల్లె, యాదమరిలోని పెరియంబాడి ప్రాంతాల్లో రెండు సబ్‌స్టేషన్ల నిర్మాణానికి అనుమతి లభించిందన్నారు. ఆయా చోట్ల 33/11 కేవీ సబ్‌స్టేషన్లను రూ.4 కోట్లతో నిర్మించనున్నట్లు చెప్పారు.

రెండు బైక్‌ల ఢీ

పలమనేరు: మండలంలోని కొలమాసనపల్లి పంచాయతీ కూర్మాయి గ్రామం వద్ద కుప్పం–పలమనేరు రహదారిపై సోమవారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు గాయపడిన వారిని ఆటోలో పలమనేరు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వారు ఇదే మండలం నక్కపల్లికి చెందిన శివకుమార్(30), ఆర్ముగం(45)గా తెలిసింది. ప్రథమ చికిత్స అనంతరం వైద్యులు వీరిని కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాలకు రెఫర్ చేశారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


కొంగారెడ్డిపల్లెలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు కార్పొరేషన్: నగరంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం విస్తృతంగా జరుగుతోంది. సోమవారం చిత్తూరులోనిక 6, 18 డివిజన్లలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పర్యటించారు. వైఎస్సార్‌సీపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డికి పట్టభద్రులు, ఉద్యోగులు ఓట్లు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. మొదటి ప్రాధాన్యత ఓటను ఆయనకు వేయాలని కోరారు. చిత్తూరు నియోజకవర్గంలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారన్నారు. మార్చి 13న జరగనున్న ఎన్నికల్లో ఆయన్ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కరపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, చుడా చైర్మన్ పురుషోత్తంరెడ్డి, డిప్యూటీ మేయర్లు చంద్రశేఖర్, రాజేష్‌కుమార్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ల నగర ఇన్‌చార్జ్‌లు కిరణ్, రాంగణేష్, ఏఎంసీ చైర్మన్ రాహుల్‌రెడ్డి, కార్పొరేటర్లు భాగ్యలక్ష్మి, సునీత, మధుబాబు, జ్ఞానజగదీష్, శోభ, అస్గర్ భాను, చల్లా ముత్తు, నాయకులు కృష్ణారెడ్డి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రచారం చేస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

శ్యాంప్రసాద్ రెడ్డిని గెలిపించండి

యాదమరి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యాంప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలని జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి, యాదమరి ఎంపీపీ సురేష్‌బాబు కోరారు. సోమవారం ఉదయం యాదమరి మండలంలోని జంగాలపల్లె, మాధవరం గ్రామ సచివాలయ పరిధిలో ప్రచారం నిర్వహించారు. ఈ నెల 13న జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్యాంప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు నాగేశ్వర్ రెడ్డి, మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉగాదిలోపు గృహ నిర్మాణాలు పూర్తిచేయాలి

ఐరాల: ఉగాది పండుగలోపు మండలంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు పూర్తిచేయాలని ఎంపీడీఓ నిర్మలాదేవి ఆదేశించారు. సోమవారం ఎం.పైపల్లెలో జగనన్న కాలనీ నిర్మాణపనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మార్చి 15వ తేదీలోగా గృహ నిర్మాణాలు చేపట్టనివారి పట్టాలను రద్దు చేస్తామని తెలిపారు. జగనన్న కాలనీల్లో అధికారులు సమన్వయంతో పనిచేసి కనీస సౌకర్యాలపై దృష్టిసారించాలన్నారు. కాలనీల్లో విద్యుత్, నీటి సౌకర్యం, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం ఆమె సచివాలయాన్ని తనిఖీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులందరికి అందేలా చూడాలని ఆదేశించారు. ఇంటి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు.

ఆక్రమిత భూములను కాపాడండి

చిత్తూరు రూరల్: చిత్తూరు నగర పరిసరప్రాంతంలో ఆక్రమణకు గురైన రావుబాదురు గుర్రప్పనాయుడు భూములను కాపాడాలని అతని కుటుంబసభ్యులు కన్నమ్మ, విజయన్, భువనేశ్వరి పేర్కొన్నారు. సోమవారం చిత్తూరు ప్రెస్ క్లబ్‌లో వారు సమావేశం నిర్వహించి మాట్లాడారు. చిత్తూరు పరిసర ప్రాంతాలు మంగసముద్రం, తిమ్మసముద్రం, తేనెబండ, గుర్రప్పనాయుడు కాలనీ, ఆర్కే మోడల్ పాఠశాల ప్రాంతాల్లో 500 ఎకరాలకు పైగా భూములు ఉన్నాయని తెలిపారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేసి తమను వేధిస్తున్నారని దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న తహసీల్దార్ సుబ్రహ్మణ్యం నకిలీ పత్రాలను సృష్టించి వేరే వ్యక్తులకు తమ భూములను రిజిస్ట్రేషన్ చేయించాడన్నారు. ఈవిషయమై చిత్తూరు పోలీసులు కేసు కూడా చేశారన్నారు. ఆక్రమణకు గురైన భూములను కాపాడి తమకు అధికారులు స్వాధీనం చేయాలని కోరారు.

చిన్నతనం నుంచే పొదుపు అలవాటు చేసుకోవాలి

బంగారుపాళెం: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే నగదు పొదుపును అలవాటు చేసుకోవాలని తుంబకుప్పం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం హరినాథరెడ్డి సూచించారు. విద్యార్థులకు సోమవారం స్టేట్‌బ్యాంక్ ఆధ్వర్యంలో జీరో బ్యాలెన్స్ ఖాతాలను ప్రారంభించారు. బ్యాంకులు, పోస్టాఫీసులు, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా నగదు పొదుపు (సేవింగ్స్) చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. పొదుపు పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. బ్యాంక్ మేనేజర్ శ్వేత, ఫీల్డ్ ఆఫీసర్ శివయ్య, ఉపాధ్యాయులు సుబ్రమణ్యం, నాగయ్య, మహేంద్ర పాల్గొన్నారు.


విద్యార్థులకు పాస్ పుస్తకాలను అందజేస్తున్న బ్యాంక్ సిబ్బంది

ఓటరు స్లిప్పుల పంపిణీ

గుడిపాల: మండలంలోని అన్ని పంచాయతీల్లో పట్టభద్రులకు ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈనెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్లిప్పులను ఆయా గ్రామాల్లో వీఆర్‌ఓలు పంపిణీ చేస్తున్నారన్నారు. ఓటర్లకు స్లిప్పులు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. గుడిపాలలో 1008 మంది పట్టభద్రులు, 33 ఉపాధ్యాయ ఓటర్లు ఉన్నారని తెలిపారు. నరహరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.


చిత్తపారలో ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓ

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న ఈఓ కుసుమ కుమారి

ఐరాల: మహిళలు హక్కులు, చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, తద్వారా సమస్యలను పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని ఈఓ కుసుమ కుమారి అన్నారు. మహిళా వారోత్సవాలను పురస్కరించుకుని మండలంలోని పాలకల పంచాయతీ కార్యాలయంలో చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ రేణుక

చిత్తూరు కలెక్టరేట్: ఎమ్మెల్సీ ఎన్నికల విధులను కర్తవ్యంగా నిర్వర్తించాలని ఆర్డీఓ రేణుక అన్నారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే వారు కచ్చితంగా తమ బాధ్యతలను పాటించాలన్నారు. అలసత్వం ప్రదర్శించకూడదని తెలిపారు. పోలింగ్ ప్రక్రియకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, మున్సిపల్ కమిషనర్ అరుణ, పలువురు తహసీల్దార్లు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 20 మంది విద్యార్థుల ఎంపిక



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

చిత్తూరు కలెక్టరేట్: జాబ్‌మేళాలో తమ కళాశాలకు చెందిన 20 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని విజ్ఞానసుధ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ శ్రీధర్ తెలిపారు. నగరంలోని మురుగానపల్లె రోడ్డులో ఉన్న కళాశాలలో సోమవారం జాబ్‌మేళా నిర్వహించారు. మొత్తం 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హెటీరో ల్యాబ్ కంపెనీకి 20 మంది ఎంపికయ్యారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

నియామకం


జగదీష్ గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

యాదమరి: తెలుగునాడు కల్లుగీత కార్మికుల మండల అధ్యక్షుడిగా కాశిరాళ్లకు చెందిన జగదీష్ గౌడ్‌ను జిల్లా అధ్యక్షుడు నాగరాజు గౌడ్ నియమించారు. సోమవారం చిత్తూరులో తెలుగునాడు కల్లుగీత కార్మికుల ఎన్నికల్లో ఆయన్ను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జగదీష్ గౌడ్ మాట్లాడుతూ.. మండల పరిధిలో ఉన్న కల్లు గీత కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

మంగళవిద్యావాణి సంచిక ఆవిష్కరణ

బంగారుపాళెం: మండలంలోని మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ×మంగళ విద్యావాణి₹ 21వ సంచికను ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా విశ్రాంత అధ్యాపకుడు శ్రీరాములురెడ్డి మాట్లాడుతూ.. క్రమశిక్షణ, విద్యపై ఆసక్తి, ఆత్మవిశ్వాసం, పట్టుదల విద్యార్థులను గొప్ప స్థాయికి తీసుకువెళతాయన్నారు. మంగళవిద్యావాణి మాస పత్రికలో కథలు, కవితలు, వ్యాసాలు, విద్యారంగానికి సంబంధించిన వ్యాసాలను విద్యార్థులతో రాయించి వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని ప్రశంసించారు. హెచ్‌ఎం లలిత, మాసపత్రిక సంపాదకుడు అరుణ్ శివప్రసాద్, ఉపాధ్యాయులు అమరనాథ్‌రెడ్డి, రమాదేవి, సంజీవి, పిళ్లారప్ప, ప్రేమకృష్ణ, కవిత పాల్గొన్నారు.


సంచికను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

తవణంపల్లె: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం అందిస్తున్న వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని తవణంపల్లె మండల వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. సోమవారం చెర్లోపల్లెలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో డాక్టర్ ప్రియాంక 79 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి కల్పించాలని వినతి

పూతలపట్టు: వడ్డేపల్లి పంచాయతీ బోడిరెడ్డి కండ్రిగ గ్రామంలోని శ్మశానికి దారి కల్పించాలని గ్రామస్తులు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్పందన కార్యక్రమం జరిగింది. ఈ క్రమంలో బోడిరెడ్డి కండ్రిగ గ్రామస్తులు అధికారులకు అర్జీ సమర్పించారు. సమస్యలను ఇప్పటికే పలుమార్లు అధికారులకు దృష్టికి తీసుకొచ్చినా పట్టించుకోలేదని వాపోయారు. స్పందించిన అధికారులు విచారించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

ఓటర్ లిస్ట్ పంపిణీ

స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు లిస్టును సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులకు అందజేశారు. ఎన్నికలపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. మండలంలో మొత్తం 2 వేల పట్టభద్రుల ఓటర్లు ఉన్నారని తెలిపారు. ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, జెడ్పీటీసీ సభ్యురాలు దేవిక, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, బాబురెడ్డి పాల్గొన్నారు.


అధికారులకు అర్జీ సమర్పిస్తున్న గ్రామస్తులు

లయన్స్ క్లబ్ సేవలు విస్తృతం చేయాలి

చిత్తూరు రూరల్: చిత్తూరులో లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాలని లయన్స్ క్లబ్ అఫ్ చిత్తూరు గోల్డ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వినూత ప్రకాష్ పిలుపునిచ్చారు. నగరంలోని లయన్స్ క్లబ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. క్లబ్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలపై ఆరా తీశారు. ప్రభుత్వాస్పత్రి వద్ద జరుగుతున్న నిత్యాన్నదాన కార్యక్రమానికి రూ.20 వేల చెక్కు, రెండు బస్తాల బియ్యం అందించారు. అనాథ శవాలకు అంత్యక్రియాలు చేస్తున్న లయన్ సభ్యులు మధుబాబు, మల్లి ఆచారి బృందానికి రూ. 5 వేల చెక్కు ఇచ్చారు. ఇంజినీరింగ్ విద్యార్థికి లాప్‌టాప్, రెండు ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు, బస్టాండ్‌లో మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటుకు సహకరించిన లయన్ సభ్యుడు శ్రావణ్‌ను సత్కరించారు. క్లబ్ ప్రెసిడెంట్ సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి ఆంజనేయులు చెట్టి, కోశాధికారి ప్రసాద్‌రెడ్డి, చైర్మన్ నరేష్ బాబు, సుభాష్ జైన్, మోహన్ రెడ్డి పాల్గొన్నారు.

గాంధీ విగ్రహం ఆవిష్కరణ

చిత్తూరు రూరల్: చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని క్షయ నివారణ కార్యాలయంలో సోమవారం గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కొంత కాలంగా ఆ కార్యాలయం అపరిశుభ్ర వాతావరణంతో కనిపించింది. కార్యాలయ ఆవరణ లోపలి భాగంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. గదులన్నీ పాతబడిన సామాన్లతో నిండిపోయాయి. వీటిని మొత్తం శుభ్రం చేయించారు. ఆవరణానికి సరికొత్త రూపాన్ని తీసుకొచ్చారు. లోపలి భాగంలోని ఖాళీ స్థలాన్ని సుందరవనంగా తీర్చిదిద్ది మహాత్ముని బొమ్మను ఏర్పాటు చేశారు. సోమవారం ఆ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ పాల్‌రవికుమార్, రెడ్డప్ప, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న అధికారులు

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నారాయణ

బంగారుపాళెం: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలను సాధించవచ్చని ఇంపాక్ట్ కో–ఆర్డినేటర్ నారాయణ అన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి, మంగళపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సోమవారం జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులను నిర్వహించారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎంలు భేరినాథ్, లలిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.